ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 19 అక్టోబరు 2025







నాగార్జున కొండను శనివారం రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ కృష్ణారావులు ఘనంగా స్వాగతం పలికారు.

-విజయపురిసౌత్

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

● ఉపాధ్యాయులకు డీఈవో చంద్రకళ దిశానిర్దేశం



నకరికల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని డీఈవో ఎల్ చంద్రకళ ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. శనివారం నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన క్లస్టర్ సమావేశంలో ఆమె ప్రసంగించారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయడానికి ఉపాధ్యాయులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను బలోపేతం చేయాలన్నారు. విద్యార్థుల్లో అభ్యాసన నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో నంబూరి సుందరరావు, ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు జడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ



అమరేశ్వరస్వామి మూలవిరాట్

22 నుంచి కార్తీకమాస పూజలు

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి కార్తీకమాసం ప్రారంభం అవుతున్నందున పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈవో రేఖ తెలిపారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యక్ష, పరోక్ష అభిషేకాలు, కుంకుమ పూజలు, మహాన్యాస రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పౌర్ణమి రోజున సాయంత్రం గ్రామోత్సవం, కృష్ణానదికి హారతులు, తెప్పోత్సవం, జ్వాలాతోరణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో క్యూలు, స్నానఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆది, సోమవారాలలో ఉదయం 4 నుంచి రాత్రి 10 వరకు, మిగిలిన రోజుల్లో రాత్రి 9 గంటల భక్తులకు ఆలయ ప్రవేశం ఉంటుందని తెలిపారు.

తెల్ల బంగారం.. సాగు చేసిన వారు మాత్రం తెల్లబోతున్నారు. పత్తిసాగు ఆరంభంలో వర్షాభావం.. ఆ తర్వాత అధిక వర్షాలు.. ఆపై తెగుళ్లతో పెట్టుబడులు పెరిగిపోయాయి. నీటి కష్టాలతో అధిగమించి.. తెగుళ్లను తప్పించుకుని.. పత్తి సాగు చేపట్టారు. వీడని వర్షాలు.. తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోగా.. ధరలు అమాంతం పతనమయ్యాయి. ఒకవైపు భయపెడుతున్న వర్షాలు.. మరోవైపు నిల్వ సమస్యలతో రైతులు తీసిన పత్తిని తీసినట్లుగా అమ్ముకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో సీసీఐ కొనుగోళ్ల కేంద్రాల ప్రారంభానికి మరికొన్ని రోజులు గడువు ఉంది. ఇదే అవకాశంగా రైతుల నుంచి తక్కువ ధరకు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఆశించనట్లుగా దిగుబడి లేక.. పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో పత్తి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



పత్తి.. పతనం

దిగుబడి, ధర తగ్గుదల

తెగనమ్ముకుంటున్న సాగుదారులు

క్వింటాల్ రూ.4500 నుంచి రూ.5200 మాత్రమే

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో తెల్ల బంగారం తెల్లబోతుంది. సీజన్ ఆరంభంలోనే వ్యాపారులు పత్తి ధరను పాతాళంలో పడేశారు. ఏదో ఒక సాకు చెప్పి క్వింటాల్ పత్తిని రూ.4500 నుంచి రూ.5200 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్ లో మొదటి పంటగా భావించే పత్తి ధర ఆరంభంలోనే అతితక్కువ స్థాయికి పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికంగా సాగయ్యే పంటల్లో పత్తి ఒకటి. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 59,140 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 2,27,180 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 4,585 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ఏటా సీసీఐ కొనుగోళ్ల ఆరంభం కావడం వల్ల పెద్దగా నష్టం (మిగతా 6లో)

పెట్టుబడి రూ.60 వేలు.. దిగుబడి అంతంతే

రైతులు పత్తి సాగు కోసం ఎకరాకు రూ.60 వేలు తగ్గకుండా పెట్టుబడి పెట్టారు. తొలకరి ఆరంభంలో కురిసిన వర్షాలకు మొక్కలు వేయగా, అప్పట్లో ఒక వారం, పది రోజులు తర్వాత కనుమరుగయ్యాయి. దీంతో చాలా పొలాల్లో మొక్కలు ఎక్కువగా చచ్చిపోయాయి. ఎర్ర తెగులు నివారణకు అధికంగా పురుగు మందులు వాడారు. దాంతో పెట్టుబడి రెండింతలైంది. ఇంత చేసినా ఎకరాకు 6 నుంచి 9 క్వింటాల్ మాత్రమే దిగుబడి వచ్చే పరిస్థితితో సాగుదారులు కన్నీటి పర్యంత మవుతున్నారు.

విస్తారంగా వర్షాలు.. ఎర్ర తెగులు

ఈ ఏడాది వర్షపాతం అధికంగా నమోదైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పత్తి సాగు మొదలు పెట్టిన తర్వాత వర్షం ఎక్కువగా కురిసింది. దీంతో పంటను ఎర్ర తెగులు ఆశించింది. తెగులు నివారణకు రైతులు పలు రకాల మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చాలా చోట్ల వర్షం నీళ్ల ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల చేలు పూర్తిగా ఉరకెత్తాయి. ఇది రైతులకు తీవ్రంగా నష్టం చేకూర్చింది.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

స్వచ్ఛాంధ్ర ర్యాలీలో కలెక్టర్ కృతికాశుక్లా

పిడుగురాళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నివాస, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. మూడో శనివారాన్ని పురస్కరించుకుని పిడుగు రాళ్లలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిశుభ్రత, మొక్కల పెంపకంపై పట్టణంలో అవగాహనకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వనసంక్షేమంతో వాయు కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. వాయు కాలుష్యంపై ప్రజల్లో అవగాహనకు గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్ కృతికాశుక్లా, పర్యావరణ ఇంజనీర్ మహ్మద్ నజీనాబేగం తదితరులు

గ్రీన్ కాకర్స్‌ను ఉపయోగించాలి

దీపావళి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఏపీపీసీబీ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ శుక్లా, పర్యావరణ ఇంజనీర్ నజీనాబేగం, ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ మధుబాబు, కమిషనర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. అధిక శబ్దాన్ని ఇచ్చే, వాయుకాలుష్యాన్ని కలిగించే టపాసులతో ఆరోగ్యానికి హాని కలుగుతుందని తెలిపారు. ప్రతిఒక్కరు గ్రీన్‌కాకర్స్‌ను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి, మున్సిపల్ డీఈ ఆదాంషఫీ, ఏఈ రోహిణి, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, జొన్నలగడ్డ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, బొల్లా శ్రీను, మందా డేవిడ్, సయ్యద్ అమీర్‌అలీ, షేక్ సైదా, జనసేన నేతలు కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా తదితరులు పాల్గొన్నారు.



ఐలాండ్ సెంటర్‌లో మానవహారంగా కూటమి నేతలు, అధికారులు, పాఠశాల విద్యార్థులు

వామ్మో.. ప్రత్యేక రైళ్లా



- భయపడుతున్న ప్రయాణికులు
- ఈ రైళ్లలో ఆదరణ, భద్రత రెండూ తక్కువే
- షెడ్యూల్ సమయానికి ప్రయాణించని వైనం
- గంటల తరబడి జాప్యంతో ప్రయాణికులకు నరకం

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రద్దీ రోజుల్లో ఒకప్పుడు ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ ఎప్పుడు ప్రకటిస్తుందా అని ప్రయాణికులు ఎదురు చూసే వాళ్లు. ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు గమ్యస్థానానికి చేరుతాయో తెలియక.. కనీస సౌకర్యా లను పట్టించుకునే వారు లేక.. నేడు స్పెషల్ ట్రైన్స్ అంటేనే భయపడి పోతున్నారు. సమయపాలన అనేది ఈ రైళ్లకు కనీసం 10 శాతం కూడా ఉండదు. ఈ కారణంగా స్లీపర్ క్లాస్/ఏసీ తరగతుల్లో అరకొరగానే ప్రయాణికులు టిక్కెట్లు రిజర్వు చేసుకుంటున్నారు. స్పెషల్ ట్రైన్స్ గురించి తగిన సమాచారం ఉండకపోవడంతో జనరల్ బోగీల్లో ఎవరూ పెద్దగా ప్రయాణించడం లేదు. దీంతో ప్రయాణికుల్లో ముఖ్యంగా మహిళల భద్రతకు గ్యారెంటీ లేకుండా పోతోంది. రైల్వే నిబంధనల ప్రకారం ఏదైనా మార్గంలో లైన్ కెపాసిటీ 100 శాతం మించ కూడదు. అయితే గుంటూరు రైల్వే డివిజన్‌లోని నంద్యాల, నడికుడి మార్గాల్లో ఇంతకు మించి రైళ్లు/గూడ్స్‌లు ప్రయాణిస్తున్నాయి. దీనికి కారణం ప్రత్యేక రైళ్లను నడుపుతుండటమే. ఏదైనా స్పెషల్ ట్రైన్ ప్రకటించేటప్పుడు పాత్ చూసుకోవాలి. ఏ సమయానికి ఆ రైలు ఏ స్టేషన్‌కు వెళ్లాలి అనేదే పాత్. ఆ ప్రకారమే నడిపితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే పాత్ నిబంధన పాటించకుండా రైళ్లను నడుపు తున్నారు. దీంతో సింగిల్ లేన్ రూట్‌లో అయితే క్రాసింగ్/ప్రిసిడెన్స్ కోసం స్పెషల్స్‌ని లూప్‌లైన్‌లో పెడతారు. డబుల్ లేన్ మార్గాల్లో రెగ్యులర్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇచ్చి స్పెషల్ ట్రైన్‌ని లూప్‌లో పెట్టి పంపుతారు. ఈ కారణంగా గంటల తరబడి ప్రత్యేక రైళ్లు ఆలస్యమౌతాయి. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లు అయితే కొన్ని సందర్భాల్లో 12 గంటలకు పైగా ఆలస్యమౌతున్న దాఖలాలు ఉన్నాయి.

చార్జీ అధికమైన ప్రాధాన్యం తక్కువ

ఈ స్పెషల్ రైళ్లలో చార్జీలు కూడా ఎక్కువే. తత్కాల్ టిక్కెట్ చార్జీకి సమానంగా ధర ఉంటుంది. అయినా రాకపోకల్లో రెగ్యులర్ రైళ్లకు ఇచ్చినంత ప్రాధాన్యం వీటికి ఇవ్వడంలేదు. ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు కదులుతాయో కూడా తెలియక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. కొన్ని రైళ్లలో అయితే ఫ్యాన్లు తిరగవు.. మరుగుదొడ్లలో నీళ్లు కూడా ఉండవు. అరకొర సౌకర్యాల మధ్య ప్రయాణికులు గోడు ఎవరూ పట్టించు కోరు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో, అత్యవసరమైన వాళ్లు మాత్రమే మరో ప్రత్యామ్నాయం లేక వీటిల్లో టిక్కెట్లు బుకింగ్ చేసుకుంటారు. ఏ ప్రత్యేక రైలులోనైనా జనరల్ బోగీలు ఖాళీగా ఉంటాయి. వీటి గురించి సమాచారం లేకపోవ డం, ఆలస్యంగా ప్రయాణిస్తుండటం ప్రధాన కారణాలు. ఇదే అదనుగా మహిళలు/సీనియర్ సిటిజన్స్ బోగీలో పురుషులు ఎక్కేస్తున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన ఆర్‌పీఎఫ్, సెక్యూరిటీ విభాగం సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఏదైనా సంఘటన జరిగిన తర్వాత కొన్ని రోజులు హడావిడి చేయడం ఆ తర్వాత పట్టించుకోకపోవడం చేస్తున్నారు. ఈ నెల 13న సంత్రగచి స్పెషల్ మహిళల బోగీలో పురుషుడు చివరి నిమిషంలో ఎక్కుతుండటాన్ని గార్డు గమనించారని రైల్వే అధికారులు చెబుతున్నారు. అలాంటప్పుడు గార్డు వైర్‌లెస్ సెట్‌లో లోకోపైలట్‌కు చెప్పి రైలుని ఆపి తగిన చర్యలు తీసుకోవాలి. అలా చేయకుండా ఆ ప్రయాణికుడు కింద పడి పోతాడని రైలుని ఆపలేదని చెబుతుండటం ఎంతవరకు సమంజసమో అధికారులు చెప్పాలి. చిన్న తప్పిదం వల్ల ఒక ప్రయాణికురాలు అత్యాచారం, దోపిడీకి గురయ్యారు. దీనికి ఎవరిని బాధ్యులను చేస్తారో చూడాలి.

రోడ్డు ప్రమాద బాధితులను రక్షిద్దాం

- కేసుల భయం వీడాలని ఎస్పీ కృష్ణారావు పిలుపు
- రెంటచింతల పోలీసుస్టేషన్ తనిఖీ.. కానిస్టేబుళ్లతో ముఖాముఖి



స్టేషన్ తనిఖీలో ఎస్ఐకి సూచనలు చేస్తున్న ఎస్పీ కృష్ణారావు

రెంటచింతల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడి కొనఊపిరితో ఉన్న వారిని రక్షించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. రెంటచింతలలోని పోలీసు స్టేషన్‌ను శనివారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత స్టేషన్ పరిసరాలను, కంప్యూటర్ గదిని పరిశీలించారు. సిబ్బంది క్వార్టర్లను పరిశీలించి సదుపాయాల గురించి ఎస్ఐ సీహెచ్ నాగార్జునను అడిగి తెలుసుకున్నారు. కానిస్టేబుళ్లతో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలన్నారు. ఫ్యాక్షన్ నెలకొన్న గ్రామాలపై నిఘా ఉంచాలని ఎస్ఐను ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గాయపడిన వారిని గోల్డెన్ అవర్(గంట లోపు) ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు నిలపవచ్చు న్నారు. కేసుల గురించి భయపడాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తే కేసులు చుట్టుముడతాయని, పోలీసుల చుట్టూ తిరాగాల్సి వస్తుందనే అపోహలను విడనాడాలన్నారు. సహాయకులకు గుడ్ సమరిటన్ చట్టం అండగా ఉంటుందని, నగదును బహుమతిని కూడా అందుకోవచ్చున్నారు.

సంస్కృతాంధ్ర పండితుడు జన్నాభట్ల మృతి

కాటికాపరి దారుణ హత్య

ఏలూరు గంజాయి.. పల్నాడులో ధ్వంసం

కాల్వలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

6

బహుళ పంటల సాగుతో లాభం

జీవ వైవిధ్యం పెరిగి భూసారం మెరుగు

ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజరు అమలకుమారి

యడ్లపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒకే పంట కంటే బహుళ పంటల సాగుతో రైతులకు లాభం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు అమలకుమారి తెలిపారు. మండలంలోని కొత్తపాలెంలో తిరుపతిరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు సాగు చేస్తున్న బహుళ పంటల కంపాక్ట్ బ్లాక్‌ను ఆమె శనివారం పరిశీలించారు. ప్రధాన పంటగా దొండ సాగు చేస్తూ అంతర పంటలుగా గోరుచిక్కుడు, పప్పు చిక్కుడు, టమాటా, వంగ, సొరకాయ, ఉల్లి, కాకర, పొట్లకాయలతోపాటు బంతి పూలు సాగు చేస్తుండడాన్ని పరిశీలించారు. సమస్యలు, సస్య రక్షణ, ఖర్చు, ఆదాయం తదితరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. బహుళ పంటల సాగుతో నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తోందని రైతులు తెలిపారు. ప్రకృతి సేద్యంలో పండించిన కూరగాయలు ఆరోగ్యకరమన్నారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ బహుళ పంటలతో నేలలో జీవ వైవిధ్యం పెరిగి భూసారం మెరుగుపడడంతోపాటు సూక్ష్మజీవులు పెరిగి పంటలకు పోషకాలు సక్రమంగా అందుతాయన్నారు. రసాయన ఎరువులు లేకుండా ఘన, ద్రవ జీవామృతాలు వినియోగించి సేద్యంతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేసేలా రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.



కొత్తపాలెంలో ప్రకృతి సేద్య పంటలను పరిశీలిస్తున్న ప్రాజెక్టు జిల్లా మేనేజర్ అమలకుమారి

ఏలూరు గంజాయి.. పల్నాడులో ధ్వంసం


జిందాల్ ప్లాంట్‌లో ఏలూరు పోలీసు అధికారులు

యడ్లపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని 22 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నమోదైన 59 కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. మండలంలోని కొండవీడు రెవెన్యూ పరిధిలో గల జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటులో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో సుమారు 3,403 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ గంజాయిని జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లో పర్యావరణ అనుకూల పద్ధతిలో ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఏలూరు అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఎస్‌డీపీవో రవిచంద్ర, డీసీఆర్‌బీ సీఐ మహమ్మద్ హబీబ్‌భాషా, ఏలూరు ఒకటవ టౌన్ సీఐ సత్యన్నారాయణ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్ల రూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ వివరాల మేరకు.. బాపట్ల పట్టణం చిల్లర గొల్లపాలేనికి చెందిన కొమ్మినేని శ్రీనివాసరావు (50) ద్విచక్ర వాహనంపై బాపట్ల నుంచి చీరాల వెళ్తున్నాడు. స్టూవర్టుపురం జాతీయ రహదారిపై వెనుక నుంచి లారీ అతని ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐతెలిపారు.

సంస్కృతాంధ్ర పండితుడు జన్నాభట్ల మృతి


జన్నాభట్ల లక్ష్మీనారాయణ

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సంస్కృతాంధ్ర పండితుడు, పౌరాణిక నటుడు, అవధాని జన్నాభట్ల లక్ష్మీనారాయణ(65) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై అకాల మరణం చెందారు. పనిమీద వినుకొండ వెళ్లి ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు తిరిగి వస్తుండగా మండలంలోని పెట్లూరివారిపాలెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా రాత్రి ఆయన మృతి చెందారు. జన్నాభట్ల పట్టణంలోని వివిధ విద్యా సంస్థలో సంస్కృతాంధ్ర పండితుడిగా పనిచేశారు. పౌరాణిక నటుడిగా రంగస్థలంపై ఎన్నో పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. ఎన్నో అవధాన ప్రక్రియల్లో పాల్గొని తన ప్రతిభ చూపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక సెక్రటరీగా పనిచేసి ఎంతోమంది పేద కళాకారులకు ప్రభుత్వం ద్వారా పెన్షన్ మంజూరు చేయించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాపక వృత్తి నుంచి విరమణ పొందాక ఆయన పౌరోహిత్యం చేస్తున్నారు. జన్నాభట్ల మృతి పట్ల నరసరావుపేట కళా వేదిక వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, నరసరావుపేట రంగస్థలి అధ్యక్షుడు మహబూబ్ సుభాని, మాజీ అధ్యక్షుడు కిలారు వెంకట్రావు, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ రామిరెడ్డి, భువనచంద్ర టౌన్ హాల్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకట్రావు, కన్వీనర్ సర్దార్ పాషా, కపలవాయి విజయ్‌కుమార్, షేక్ బాజీ మస్తాన్, నల్లపాటి బోస్, మార్కెట్ మస్తాన్ వలి, ఎ.ఎ.మధుకుమార్ పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

నింగిలోకి కేఎల్‌యూ శాటిలైట్లు

● విద్యార్థుల కృషి అమోఘమన్న మంత్రి శ్రీనివాసవర్మ, రఘురామ కృష్ణంరాజు, కోనేరు నిఖిల


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

తాడేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు అధ్యాపకులతో కలిసి రూపొందించిన మూడు శాటిలైట్‌లను విజయవంతంగా నింగిలోకి పంపారు. వర్సిటీ తలపెట్టిన కేఎల్ జాక్ నింగిలోకి వెళ్లి పరిశోధన ప్రారంభించింది. శనివారం ఉదయం 5.45 లకు కాన్ శాట్, కేఎల్ జాక్ శాటిలైట్‌ను పీకో బెలూన్ సాయంతో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, కేఎల్‌యూ వైస్ ఛైర్మన్ కోనేరు నిఖిల, వీసీ సారథివర్మ, జాక్ శాటిలైట్ రూపకర్త కేసీహెచ్ శ్రీకావ్య విద్యార్థులతో కలిసి నింగిలోకి వదిలారు. ఏటీపీ గన్నవరం ఎయిర్ ట్రాఫిక్ క్లియరెన్స్ వచ్చాక 6.45 గంటలకు కేఎల్ శాట్ 2ను బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థ సహకారం, ఫ్లయిట్ మోడ్ డ్రోన్ సాయంతో నింగిలోకి పంపారు. నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లిన తర్వాత కేఎల్‌యూ విద్యార్థులు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా శాటిలైట్.. గంటపాటు భూమి నుంచి సుమారు 12 కిలోమీటర్ల ఎత్తులో 60 కిలోమీటర్లు సమాంతరంగా ప్రయాణించి పరిశోధనలు చేసి.. మళ్లీ లాంచ్ పాడ్‌పై విజయవంతంగా దిగింది. కేఎల్ జాక్ శాటిలైట్ గాలి నాణ్యతను, కేఎల్ శాట్-2 వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేయనుంది. దీంతో 3-కాన్ శాట్‌ల ప్రయోగం విజయవంతమైంది. నింగిలోకి వెళ్లిన కాన్ శాట్ సుమారు 20 నిమిషాల పాటు ఆకాశంలోనే విహరిస్తూ కంట్రోల్ సెంటర్‌కు ఎప్పటికప్పుడు డేటాను పంపుతూ సుమారు 20 నిమిషాల తర్వాత లాంచ్‌పాడ్ వద్ద దిగింది. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ప్రతికళాశాల ఒక ప్రయోగశాలగా మారాల్సిన అవసరం ఉందన్నారు. 2047 నాటికి మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ పేరుతో ప్రధాని మోదీ స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణంరాజు ఉప గ్రహానికి రూపకల్పన చేసిన బృంద సభ్యులను, అధ్యాపకులను అభినందించారు. కేఎల్‌యూ వైస్ ఛైర్మన్ కోనేరు నిఖిలా కార్తికేయన్ మాట్లాడుతూ రాకెట్ ప్రయోగ దిశగా అడుగులు వేస్తామని, విద్యార్థుల కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, ఆర్అండ్ డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్, డీన్‌లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగోతు చిన్నమ్మకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, చదలవాడ

నకరికల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య మాతృమూర్తి నాగోతు చిన్నమ్మ దశ దిన కర్మ తురకపాలెంలో శనివారం నిర్వహించారు. నాగోతు చిన్నమ్మకు శ్రద్ధాంజలి ఘటించి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. నాగోతు శౌరయ్యను, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట, చిలకలూరిపేట ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, రాయల శ్రీనివాసరావు, షేక్ అలీబాషా, దరువూరి నాగేశ్వరరావు, శివ నాగమల్లేశ్వరరావు, ఎలినేడి రామస్వామి, వందనాదేవి, మొక్కపాటి రామచంద్రరరావు, పులిమి రామిరెడ్డి, పూజల వెంకట కోటయ్య, అంకాళ్ళ ప్రభుదాసు, గట్టినేని రమేష్, నెల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

కాటికాపరి దారుణ హత్య


ఘటనా స్థలాన్ని పరశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నకరికల్లు రోడ్డులో ఉన్న స్వర్గపురి -2లో కాటికాపరిగా పని చేస్తున్న గడ్డిపర్తి ఎఫ్రాన్ (31)ను శుక్రవార ం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా గొడ్డలితో నరికి హత్య చేశారు. స్థానిక క్రిష్టియన్‌పాలేనికి చెందిన ఎఫ్రాన్ 18 నెలలుగా స్వర్గపురి - 2లో కాటికాపరిగా పనిచేస్తున్నాడు. నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు, రూరల్, పట్టణ సీఐలు రామకృష్ణ, ఫిరోజ్, హైమారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉండవ చ్చని మృతుని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్‌టీం ఆధారా లు సేకరించింది. మృతుడి సోదరుడు రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఫిరోజ ఫాతిమా తెలిపారు.

కాల్వలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

కొల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాల్వలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు కాపాడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. స్థానికుల వివరాల మేరకు.. సుగ్గునలంక గ్రామానికి చెందిన సుగ్గున వెంకటసుబ్బమ్మ (75) అదే గ్రామంలో తన కుమార్తె వద్ద నివాసం ఉంటోంది. ఇటీవల శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యశాలలో చేరి వారం క్రితం ఆరోగ్యం మెరుగుపడడంతో ఇంటికి వచ్చింది. శనివారం సుగ్గునలంక నుంచి కొల్లూరు చేరుకుని రేపల్లె బ్యాంకు కెనాల్‌లో దూకింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే కాల్వలోకి దూకి ఆమెను ఒడ్డుకు చేర్చారు. ఆమె తన వివరాలు వెల్లడించి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. సమాచారం తెలుసుకున్న వృద్ధురాలి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకువెళ్లారు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సీహెచ్‌ఓల.. సమస్యల పరిష్కారానికి వినతి

గుంటూరు సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సీహెచ్‌ఓ(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్)లు తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర అధికారులకు వినతి పత్రం సమర్పించారు. శనివారం మంగళగిరిలోని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో ఎస్‌ఓ ప్రకాష్‌రావు, స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్యామల, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్రహ్మణ్యంను కలసి తమ సమస్యలు ఏకరువు పెట్టారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని క్రమబద్ధీకరించాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. బదిలీ లకు అవకాశం కల్పించాలని విన్నవించారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం. గుంటూరు జిల్లా ఏపీఎంసీఏ ప్రధాన కార్యదర్శి పల్లపాటి లింగరాజు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు భాను మహేష్, నవీన్, వర్షిణి, నీలిమ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న లింగరాజు, భాను మహేష్ తదితరులు

పత్తి.. పతనం

(5వ పేజీ తరువాయి)

ఉండదన్న భావనతో ఎక్కువ గానే పత్తి సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది అధిక వర్షపాతం వల్ల రైతులు అంచనాలు తల్లకిందులు అవుతున్నాయి. వర్షం ఎక్కువగా కురవడం పత్తికి శాపంగా మారింది. నెమ్ము ఎక్కువగా ఉందని వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

పల్నాడు జిల్లాలో పత్తి అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో తీసిన పత్తిని తీసినట్లు అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. రేపోమాపో సీసీఐ కేంద్రాలు తెరిచే అవకాశం ఉన్నా పెట్టుబడి పెట్టిన వ్యాపారులు ఒత్తిడితో రైతులు తెల్ల బంగారాన్ని తెగనమ్ముకుంటున్నారు.


సీసీఐతోనే.. మద్దతు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఈ నెల 21 నుంచి తెరుస్తామని చెబుతుంది. ఈ ఏడాది సీసీఐ పత్తి క్వింటాల్ ధర మొదటి శ్రేణి రూ.8,110, దిగువ శ్రేణికి రూ.7,710 వరకు మద్దతు ధర గా నిర్ణయించారు. అయితే పత్తి తీతలు మొదలు పెట్టి రైతులు నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడం.. అడపాదడపా వర్షాలతో తీసిన పత్తిని తీసినట్లు విక్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలు తగ్గించి ఇష్టారీతిన కొనుగోలు చేస్తుండగా తప్పనిసరి పరిస్థితుల్లో సాగుదారులు అమ్ముకుంటున్నారు. సీసీఐ కేంద్రాలు తెరిస్తే వ్యాపారులు కూడా కొంత మేరకు ధరలు పెంచి కొనుగోలు చేసే అవకాశం ఉంది.

జీఎస్టీ తగ్గింపుతో చౌకగా సోలార్ ప్యానెల్స్

● ఏపీట్రాన్స్‌కో ఏఈ మస్తాన్ వలి

రెంటచింతల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు కాలుష్య నివారణను దృష్టిలో ఉంచుకుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సౌర విద్యుదుత్పత్తికి ప్రాధాన్యత ఇస్తున్నాయని జీఎస్టీ తగ్గింపుతో గృహాల్లో ఏర్పాటు చేసుకోవడానికి వినియోగదారులు ముందుకు రావాలని ఏపీట్రాన్స్‌కో ఏఈ మస్తాన్‌వలి కోరారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శనివారం రెంటచింతల పురవీధుల్లో విద్యుత్ ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గడం వల్ల సోలార్ ప్యానెల్స్ ఇతర పరికరాల ధరలు బాగా తగ్గాయన్నారు. క్షేత్రస్థాయిలో సూర్యఘర్ పథకాన్ని విస్తరింపచేసేందుకు స్థానిక నేతలు సర్పంచులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, అచ్యుత్, రాజు, వెంకటరెడ్డి, షరీఫ్, పాల్గొన్నారు.



రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్ కృత్తికాశుక్లా

మాచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కృత్తికాశుక్లా వైద్యులకు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆమె సందర్శించారు. ఆస్పత్రిలోని విభాగాలను, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యం, సౌకర్యాలు, వైద్యుల తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మొదటగా ప్రభుత్వాస్పత్రి గుర్తుకు వచ్చేలా పనితీరు ఉండాలని వైద్యులకు సూచించారు. పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ చారి, వైద్యులు ఉదయభాను, ప్రకాష్, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృత్తికా శుక్లా

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేద్దాం

● ఎస్ఈ వెంకటరమణ

రెంటచింతల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రా స్వచ్ఛాంధ్రా సాధనకు కృషి చేద్దామని ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేదిద్దామని అప్పుడే పర్యావరణ సమతుల్యత సాధించవొచ్చని టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ ఈ కె. వెంకటరమణ కోరారు. శనివారం ప్రాజెక్టు ఆవరణలో ఉద్యోగులంతా ప్లకార్డులను చేబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ సంచులను వినియోగించ వద్దన్నారు.కార్యక్రమంలో జీఎం శ్రీనివాసరావు, ఈఈలు సుబ్రహ్మణ్యం, గిరిబాబు, నిరంజన్, మల్లేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


సత్రశాల విద్యుత్ ప్రాజెక్టులో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

మాతా శిశుమరణాలు తగ్గించడానికి కిల్కారి కాల్స్

● రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజు

మాచర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాతా శిశుమరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కిల్కారి కాల్స్ ప్రవేశపెట్టిందని కిల్కారి రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు అన్నారు. శనివారం ఆయన స్థానిక ట్రైబల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. అనంతరం గర్భిణులు, బాలింతల గృహాలకు వెళ్లి కిల్కారి కాల్స్ వారికెలా ఉపయోగపడుతున్నారో నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీరాం, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

నకరికల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నకరికల్లు ఎస్ఐ సతీష్ విద్యార్థులకు సూచించారు. శనివారం నకరికల్లు జడ్పీ హైస్కూల్లో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్లకార్డుల ప్రదర్శన చేయించారు. సైబర్ క్రైం జరిగే విధానాన్ని, సైబర్ సెక్యూరిటీల గురించి సతీష్ అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలను తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

గురజాలటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అసిస్ట్ - ఐటీసీ ఆధ్వర్యాన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, సిబ్బందికి అసిస్ట్ ట్రైజనర్ సీహెచ్ బోలయ్య ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, ఏవో తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తొలగించండి

గురజాలటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో డంపింగ్ యార్డును తొలగించాలని అక్కడి నివాసితులు, రైతులు శనివారం గురజాల నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణకు వినతిపత్రం అందించారు. డంపింగ్ యార్డు వల్ల దుర్వాసన వస్తుందన్నారు. దీనిపై కమిషనర్ శివన్నారాయణ మాట్లాడుతూ డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

ముప్పాళ్ళ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లవరంనకు చెందిన టీడీపీ కార్యకర్త దివ్యకోలు శివ నాగవర్దన్ ఇటీవల మృతి చెందటంతో ఆయన కుటుంబసభ్యులకు టీడీపీ మండల అధ్యక్షుడు రావిపాటి దేవేంద్రరావు రూ.20వేలు ఆర్థిక సాయాన్ని శనివారం ముప్పాళ్ళ మండల పరిషత్ మాజీ వైస్ చైర్మన్ రావిపాటి మధుబాబు చేతుల మీదుగా అందించారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని మధుబాబు తెలిపారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ

పిడుగురాళ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. సెప్టెంబరు 21వ తేదీన శంకర కంటి ఆస్పత్రి వైద్యులతో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 150 మందికి శుక్లాల ఆపరేషన్ చేశారు. వారందరికీ శనివారం కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమంలో శంకర కంటి వైద్యులతో పాటు క్లబ్ అధ్యక్షుడు కోట రమేష్, పాండురంగ శ్రీను, పచ్చి పులుసు పాపయ్యగుప్తా, ఊటుకూరి గురునాధం, నీరుమళ్ల రాజేష్, కొత్త రవి, శ్రీను, పాల్గొన్నారు.

ఏజీపీగా మౌలాలి

పిడుగురాళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షేక్ మౌలాలిని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టులో ఏజీపీగా నియమిస్తూ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. నియామకం తేదీ నుంచి మూడేళ్లపాటు ఏజీపీగా మౌలాలి పనిచేయనున్నారని తెలిపారు. మౌలాలి నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

యువత బాధ్యతతో మెలగాలి

● న్యాయాధికారి ప్రవళిక

పిడుగురాళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి యువత సమాజంలో బాధ్యతాయుతంగా మెలగాలని పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ప్రవళిక తెలిపారు. శనివారం పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సహకారంతో జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ జెండా విలువను గుర్తు చేశారు. నేటి యువత మత్తు, మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా భవిష్యత్‌ను దృష్టిలో ఉంచు కొని చదువుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, న్యాయవాదులు పాల్గొన్నారు.


బాణసంచా దుకాణాల ఏర్పాట్లకు అనుమతి తప్పనిసరి

● సీఐ భాస్కరరావు

దాచేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా ఏర్పాట్లకు నిబంధనలు పాటించాలని సీఐ భాస్కరరావు ఆదేశించారు. శనివారం దాచేపల్లి నగర పంచాయతీలోని బ్రహ్మనాయుడు ఆడిటోరియం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గరలో ఉన్న ఖాళీ స్థలాల్లో దీపావళి బాణసంచా అమ్మకాలకు సంబంధించిన దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పది షాపులకు పైగా అనుమతులు కోరుతూ దరఖాస్తులు వచ్చాయి. ఎవరైనా సరే నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు. ఎటువంటి ఇబ్బంది కరమైనటువంటి సంఘటనలు జరిగితే సహించమన్నారు.











చిరంజీవి.. ప్రాణదాన స్ఫూర్తివి..!

● అవయవదానంతో 8 మందికి జీవం పోసిన సాయికిరణ్

● ప్రాణం విడిచినా.. చిర కాలం జీవించే అవకాశం

● అవయవదానం పై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి



సాయి కిరణ్ పార్థివ దేహానికి వైద్య బృందం నివాళి(ఫైల్)

గుంటూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మరణం మనిషి జీవితానికి ముగింపు అని అనుకుంటారు. మరణించిన తర్వాత కూడా జీవించే మార్గం అవయవ దానం. దీనిపై అనేక మందిలో అవగాహన పెరుగుతోంది. తనను తాను చిరంజీవిలా మార్చుకోవాలన్న కాంక్ష కనిపిస్తోంది. వందలాది మంది అవయవ దానం వైపు అడుగులు వేస్తున్నారు.

అవయవ దానానికి చట్టబద్ధత

భారత ప్రభుత్వం 1994లో 'ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్' ద్వారా అవయవ దానం చట్టబద్ధత చేసింది. జీవించి ఉన్నవారు తమ అవయవాలను దానం చేయాలనే సంకల్పం తెలుపుతూ ముందుగానే నమోదు చేసుకోవచ్చు. మరణానంతరం దానం చేయాలంటే కుటుంబ సభ్యుల సమ్మతి అవసరం. ప్రతి మెడికల్ కాలేజ్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుకోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశారు. ముందు గానే సమ్మతి తెలియజేయడంతో పాటు.. మరణించిన తర్వాత సమాచారం ఆయా ఆసుపత్రికి చేరవేయడం ఇందులో కీలకమని డాక్టర్స్ చెబుతున్నారు.

అవగాహనా కార్యక్రమాలు

ఇటీవల గుంటూరు, విజయవాడ, హైదరాబాద్‌లో అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు పెరుగుతున్నాయి. అధికంగా యువత ఈ ఉద్యమంలో పాల్గొంటోంది. "జీవితం ఒకసారి వస్తుంది... కానీ మన అవయవాలు మరికొంత మందికి కొత్త జీవితం ఇవ్వగలవు" అనే సందేశం వేగంగా వ్యాప్తి చెందుతోంది.

అవయవదానం ఉద్యమ స్థాయికి చేరాలి



రాష్ట్రంలో అవయవదానం ఉద్యమ స్థాయికి చేరాలని, ఇందుకోసం ప్రజల్లో తగినంత అవగాహన పెంచాలని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్, ఏపీ శరీర, అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వి పేర్కొన్నారు. ఒక వ్యక్తి మరణిస్తే అవయవదానం ద్వారా ఎనిమిది మంది జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసాదించవచ్చని ఆయన వివరించారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు, కళ్ల వంటి అవయవాల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది బాధితులు జీవన్‌దాన్ ట్రస్ట్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

దానం చేయగలిగే శరీర భాగాలు

1. గుండె
2. కాలేయం
3. మూత్రపిండాలు
4. ఊపిరితిత్తులు
5. కంటి కార్నియా

మరణించినా.. వెలుగుల నింపిన ఆశా కిరణం



గుంటూరు జిల్లా మంగళగిరి యువకుడు సాయి కిరణ్ (26) ప్రమా దంలో తీవ్రంగా గాయపడి.. బ్రెయిన్‌డెడ్ అయ్యింది. అతని కుటుంబం పెద్ద మనసుతో అవయవ దానం చేసేందుకు ముందు కొచ్చింది. ఈ నిర్ణయం ఎనిమిది మందికి కొత్త జీవం పోసింది. సాయి కిరణ్ గుండెను హైదరాబాదు ఆసు పత్రిలో ఉన్న ఒక రోగికి విజయ వంతంగా మార్చిడి చేశారు. కాలేయం చెన్నైకి, ఒక మూత్రపిండం విజయవా డకు, మరొకటి విశాఖకు తరలించారు. కంటి కార్నియా, ఊపిరితిత్తులు ఇతర ఆసుపత్రులకు పంపించారు. ఇలా దేశం లోని ఆయా రాష్ట్రాలకు చెందిన ఎనిమిదిమందికి సాయి కిరణ్ అవయవాలను అమర్చారు. ఇప్పుడు సాయి కిరణ్ వారందరి లోనూ జీవించే ఉన్నాడు.

కొత్తగా పల్లె పాలన! క్లస్టర్ వ్యవస్థకు స్వస్తి

గ్రేడులుగా గ్రామ పంచాయతీల విభజన

సత్తెనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్త సంస్కరణలతో పల్లె పాలన మారనుంది. గ్రామ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి తీసుకు వస్తున్న నూతన విధానానికి రాష్ట్ర మంత్రి వర్గం మూడు రోజుల కింద ఆమోదం తెలిపింది. ప్రజలకు చేరువగా పాలన ఉండటంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో నిధులు రాబట్టేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో క్లస్టర్ వ్యవస్థకు మంగళం పలికింది. గ్రేడుల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. పట్టణ సమీపంలో ఉండే పంచాయతీలను రూరల్, అర్బన్ పంచాయతీలుగా ప్రత్యేక గ్రేడు ఇస్తున్నారు. వీటిలో పది వేల జనాభా, కోటి పైన ఆదాయం ఉండాలి. ఈ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శుల స్థానంలో ఈవోపీఆర్‌డీలు నియమితులు కానున్నారు. మునిసిపాలిటీల్లో ఏ విధమైన పాలన ఉంటుందో ఇక్కడ అదే తరహా పాలన కొనసాగుతుంది. మిగిలిన పంచాయతీలను మూడు వేలకు పైగా జనాభా ఉన్న వాటిని గ్రేడు -1గా, మూడు వేలు జనాభా ఉన్న వాటిని గ్రేడు-2, రెండు వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడు-3గా విభజించారు. ఇలా గ్రామ పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరో వైపు సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇక నుంచి పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులుగా వ్యవహరిస్తారు. పల్లెల అభివృద్ధిలో వీరి పాత్ర కీలకం చేశారు. ప్రతి పంచాయతీకి ఒక డెవలప్‌మెంట్ అధికారి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పల్నాడు జిల్లాలో 529 వరకు పంచాయతీలు ఉన్నాయి.

23 నుంచి విద్యార్థుల ఆధార్ నవీకరణ

పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు



సత్తెనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధార్ వివరాల మార్పులు, నవీకరణ కోసం ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్ పెండింగ్ ఉన్న వారి కోసం వీటిని ఏర్పాటు చేస్తు న్నారు. ఇందుకు సంబంధించి గ్రామ, వార్డు సచివా లయాల శాఖ డైరెక్టర్ ఎం.శివ ప్రసాదు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో వసతి, నెట్ సౌకర్యం, విద్యుత్, ప్రింటర్ సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఆధార్ నవీకరణ తప్పనిసరి. పిల్లలు పెరుగుతున్న కొద్ది వారి వేలిముద్రలు, ఇతర బయోమెట్రిక్ లక్షణా లు మారే అవకాశం ఉన్నందున ఈ వివరాల కచ్చిత త్వాన్ని, విశ్వసనీయతను కాపాడుకోవడానికి కేంద్రం ఆధార్ నవీకరణ తప్పనిసరి చేసింది. ఆధార్ తీసుకు న్న తర్వాత ఐదేళ్లు నిండిన పిల్లలు మొదటి సారి, 15 ఏళ్లు నిండిన బాలలు రెండవసారి బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

వ్యత్యాసం ఎందుకు?

● ఖమ్మం నుంచి బిహార్ వెళ్లే మిర్చి లారీలు ఇక్కడివే..

● అలాంటప్పుడు కిరాయిలో రూ.30 వేల వ్యత్యాసం ఎందుకు?

● బ్రోకర్లు, యూనియన్ నాయకుల కుమ్మక్కుపై అనుమానాలు

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్, ఇక్కడి గుంటూరు మిర్చియార్డు నుంచి బిహార్‌లో మిర్చి ఎగుమతి అయ్యే ప్రాంతాలకు దూరం ఇంచుమించు సమానం. అయినప్పటికీ అక్కడి నుంచి లారీ కిరాయి ఇక్కడి కంటే రూ. 30 వేలు తక్కువగా ఉంటుంది. ఇదే ప్రధాన కారణంగా



గుంటూరు మిర్చియార్డు

బయ్యర్లు చూపుతూ అక్కడికి వెళ్లి మిర్చి కొనుగోలు చేస్తున్నారని ఎగుమతి వ్యాపారులు చెబుతున్నారు. గుంటూరు మిర్చి బిజినెస్ అక్కడికి క్రమక్రమంగా తరలిపోతుండటానికి కూడా ఇదే మూలమని పేర్కొంటున్నారు. అక్కడి నుంచి లారీలు కిరాయికి పెట్టేది ఇక్కడి లారీ బ్రోకర్లే కావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అక్కడ తక్కువ కిరాయికి లారీలు పెడుతూ ఇక్కడ ఎందుకు ఎక్కువ డిమాండ్ చేస్తున్నారనేదే అంతుచిక్కకుండా ఉంది.

లారీ యూనియన్‌లో సీరియల్ పాటిస్తున్నామని చెబుతున్నారు.. అయితే ఎక్కువ సంఖ్యలో లారీలున్న వాళ్లకి నెలలో మూడు ట్రిప్పులు పడుతుంటే సింగిల్ లారీ ఉన్న యజమానులకు నెలకో, 40 రోజులకో ఒక ట్రిప్ కిరాయి దొరుకుతుంది. ఖమ్మం ఏఎంసీ నుంచి ఇక్కడి లారీలు పెట్టడం వల్ల గుంటూరులో లారీలు దొరకడం లేదు. అప్పుడు అదనపు కిరాయిని డిమాండ్ చేస్తూ బయటి నుంచి లారీలను పిలిపిస్తున్నారని ట్రేడర్లు ఆరోపిస్తున్నారు. ఖమ్మం ఏఎంసీలో లోడింగ్ చార్జీలు, కమీషన్ తక్కువగా ఉండటం వల్ల ట్రిప్‌కి రూ. 5 వేల వరకు మిగులుతుందని లారీ యజమానులు ఆశపడుతున్నారు. ఇక్కడ లోడింగ్ ఖర్చు రూ. 8 వేలు, దానికి బ్రోకర్ అదనంగా రూ. 4 వేలు పెంచి రూ. 12 వేలు వసూలు చేస్తున్నారు. దీని వల్ల బ్రోకర్‌కి అదనంగా మరో రూ. 4 వేలు మిగులుతుంది. ఇదంతా లారీ యజమాని వద్ద వసూలు చేసేదే. దీంతో ఎక్కువ కిరాయిని యజమానులు కోరుతున్నారు.

రాజధానిలో బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు



అసెంబ్లీ భవన పునాదులను తిలకిస్తున్న బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు

తుళ్లూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని కొండమరాజుపాలెం రాయపూడి రెవెన్యూలో నిర్మితమవుతున్న గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు 50 మంది శనివారం సందర్శించారు. షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ సంస్థలు శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హెచ్‌ఓడీ, హైకోర్టు భవనాలను నిర్మించేందుకు టెండర్లు దక్కించుకున్న విషయం తెలిసిందే. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ బిల్డింగ్‌ల నిర్మాణ కోసం పటిష్టమైన పునాదులు వేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వాటిని నీటిలో నానబెట్టారు. అయినా అవి చెక్కు చెదరలేదని మద్రాసు, హైద్రాబాద్ ఐఐటీలు పరిశీలించి నివేదికలు ఇచ్చాయి. కూటమి ప్రభుత్వంలో ఆయా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులను బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఇటీవలే రాజధాని అమరావతిలో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం సీఎం చంద్రబాబు నాయుడి చేతుల మీదగా ప్రారంభమైంది. జీ ప్లస్ 7 అంతస్థులతో నిర్మాణం చేసి అందుబాటులోకి వచ్చిన తొలి శాశ్వత ప్రభుత్వ కార్యాలయం ఇదే. దీనిని చూడటానికి కూడా సందర్శకులు వస్తున్నారు. ఆంక్షలు ఉండడం వల్ల అందరూ సందర్శించడానికి అనుమతులుండడం లేదు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు, ఉద్యోగుల ఇళ్ల టవర్లను బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు సందర్శించి సెల్ఫీలు తీసుకున్నారు.

162 మందికి వైద్య సాయం



వైద్య పరీక్షలు చేయించుకొంటున్న ఉద్యోగులు

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ ప్రతి శనివారం నిర్వహిస్తున్న హెల్త్ ఆన్ వీల్స్ మొబైల్ ట్రైన్ క్యాంపులో ఈ వారం 162 మంది వైద్యసాయం పొందారు. నడికుడి మార్గంలో ఈ క్యాంపుని రైల్వే శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా 157 మందికి ర్యాండమ్ బ్లడ్ షుగర్, బీపీ పరీక్షలు చేశారు. వీరిలో 13 మందికి అసలు డయాబెటీస్/బీపీ ఉన్నట్లే తెలియలేదు. ఆయా రోగులకు విషయాన్ని తెలియజేసి మందులు ఇచ్చారు. క్రమం తప్పకుండా ఇకపై వైద్యసాయం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ డీఎంవో డాక్టర్ వీబీ మహర్షి మాట్లాడుతూ కార్డియాక్ పరీక్షల నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ వరకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

పునరుత్పాదక శక్తి పరికరాలపై... జీఎస్‌టీ తగ్గింపు కొత్త శకానికి నాంది

● ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లాకు ప్రథమ స్థానం: కలెక్టర్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, వేదికపై ఎమ్మెల్యే రామాంజనేయులు, కమిషనర్ తదితరులు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక శక్తి పరికరాలపై జీఎస్‌టీ తగ్గింపు కొత్త శకానికి నాంది పలుకుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్, నెడ్ క్యాప్ వీసీ, ఎండీ కమలాకరబాబు, కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్‌టీ కౌన్సిల్ జీఎస్‌టీ 2.0 సంస్కరణల ద్వారా వివిధ రంగాలకు చెందిన వస్తువులపై తగ్గించిన పన్నుల శాతంపై దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కోసం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అవగాహన కార్యక్రమంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. కుసుమ పథకం ద్వారా వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేవారికి మరింత ఎక్కువగా నగదు పొదుపు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ సూపర్ జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ. లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు పొదుపు అవుతుందన్నారు. డీసీఎమ్ఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు, డీఆర్వో ఖాజావలి, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ కృష్ణారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దారు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

దీపం-2 మూడో విడత రాయితీ ఎప్పుడో!

● 80 రోజులు అయినా బ్యాంకు ఖాతాల్లో జమ కాని పరిస్థితి

● పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు



గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపం-2 మూడో విడత వంట గ్యాస్ వంద శాతం సబ్సిడీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. ఆగస్టు నెల ఒకటో తేదీ నుంచి బుకింగ్స్, డెలివరీలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు చాలా మందికి నగదు జమ కాలేదు. దీంతో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తిందేమోనని చాలా మంది పీజీఆర్ఎస్‌కు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. అలానే రెండు, మూడో విడతల నుంచి తాము ఏమైనా అనర్హులమయ్యామానని వాకబు చేస్తున్నారు. నిత్యం వందల మంది పౌర సరఫరాల అధికారుల వద్దకు వెళ్లి వంట గ్యాస్ సబ్సిడీ గురించి ఆరా తీస్తున్నారు. ప్రభుత్వమే ఇంకా రాయితీ బడ్జెట్ విడుదల చేయలేదని అధికారులు చెప్పి పంపిస్తున్నారు.

గత ఏడాది దీపావళి పండగ సందర్భంగా సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకాన్ని ప్రారంభించింది. తొలి విడత ఈ సంవత్సరం మార్చి వరకు అమలు చేసింది. రెండో విడతని ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూలై నెలాఖరు వరకు, మూడో విడతని ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలు చేస్తోంది. అయితే రెండో విడతలోనే ఇంకా చాలామందికి దీపం-2 రాయితీ నగదు జమ కాలేదు. మూడో విడతకు సంబంధించి బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు 2,48,484 వంటగ్యాస్ రీఫిల్ బుకింగ్స్, డెలివరీలు జరిగాయి. అయితే వీళ్లలో 60,854 మందికే రాయితీ విడుదల జరిగింది. గుంటూరు జిల్లాలో 3,52,110 రీఫిల్ డెలివరీలు జరగగా 84,822 మందికి రాయితీ విడుదలైందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 3,41,692 డెలివరీలకు 76,405 మందికి సబ్సిడీ విడుదలైందని తెలిపారు.

పైన పేర్కొన్న గణాంకాలను పరిగణనలోకి తీసుకొంటే సబ్సిడీ విడుదల 20 నుంచి 25 శాతం మధ్యనే ఉంది. ఈ దీపావళి పండగకు అందరికి రాయితీ విడుదల జరుగుతుందని లబ్ధిదారులు భావించారు. అయితే ఏ కారణం చేతనో ఇంకా బడ్జెట్ విడుదల కాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే రెండో విడతలో పెండింగ్, మూడో విడత రీఫిల్ డెలివరీలకు సంబంధించిన సబ్సిడీని విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి పీజీఆర్ఎస్‌లో వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా దీపం-2కు సంబంధించినవే ఉంటున్నాయి. వాటిని క్లోజ్ చేయడానికి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నందున రాబోయే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించి.. బడ్జెట్ విడుదల చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కాలుష్య రహిత దీపావళిని జరుపుకుందాం : కలెక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్నకలెక్టర్ అన్సారియా

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాయు, శబ్ధ కాలుష్య రహిత దీపావళిని జరుపుకుందామని జిల్లా ప్రజలను కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో దీపావళిపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో కలసి ఆమె ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దీపాలను వెలిగించడం మన సంస్కృతిలో భాగమన్నారు. కాలుష్యానికి కారణమయ్యే టపాసుల జోలికి వెళ్లొద్దని సూచించారు. హరిత టపాసులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పర్యావరణ ఇంజనీరు ఎండీ నజీనా బేగం మాట్లాడుతూ రసాయనాల ఆధారిత టపాసులతో వాయు, ధ్వని కాలుష్యాన్ని పెంచుతాయన్నారు. అంతేగాక పర్యావరణంతో పాటు ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రీన్ క్రాకర్స్‌ను వినియోగించాలని కోరారు. కలెక్టర్ ఆవిష్కరించిన ఈ పోస్టర్లను అన్ని విద్యాసంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ, డీఎంహెచ్‌వో కే.విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బీవీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

తుళ్లూరు, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి) ఎలుకల మందు తిని బాలిక మృతి చెందింది. తుళ్లూరు పోలీసుల వివరాల మేరకు.. అచ్చంపేటకు చెందిన రామయ్యకు ముగ్గురు పిల్లలు, కుమారుడు ఉన్నాడు. మంగళగిరి మండలం కురగల్లులో ఉంటూ ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో అంట్లు కడుగుతూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అచ్చం పేట వెళ్లిన సమయంలో అప్పులు వాళ్లు బాలిక కోటేశ్వరి ముందే రామయ్య మీదకు వచ్చారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక ఈ నెల 14న తుళ్లూరు పెదనాన్న ఇంటికి వచ్చిన సమయంలో ఎలుకల మందు తినింది. అనంతరం కురగల్లు ఇంటికి చేకున్నారు. సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన కోటేశ్వరిని హాస్పటల్‌లో చేర్చారు. చికిత్సపొందుతూ శనివారం మరణించింది. ఎస్సై బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

● పోలీసుల అదుపులో పలువురు నిర్వాహకులు, విటులు

గుంటూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎస్‌బీ సీఐ ఆళమరి శ్రీనివాస్ పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ బృందాలు శనివారం జిల్లా వ్యాప్తంగా వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించారు. బ్రాడీపేట 3/12వ లైన్ లోని లోని ఒక ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముడావత్ పద్మ, ముడావత్ గోపి నాయక్, మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అలాగే నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావుతోట 7వ లైనుకు చెందిన ఆషా వ్యభిచార గృహంపై దాడి చేశారు. మంగళదాస్ నగర్‌కు చెందిన మురికిపూడి కోటేశ్వరరావు, విజయవాడకు చెందిన మరో మహిళను అదుపులోకి తీసుకుని రెస్క్యూ హోం తరలించారు. పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక భవనంలో పేకాట ఆడుతున్న వారిపై దాడి నిర్వహించి పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10 సెల్ ఫోన్లను, రూ.25,500 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం: జడ్పీ సీఈవో



మొక్క నాటుతున్న సీఈఓ

గుంటూరు (తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ హిత కార్యక్రమాలను చేపట్టాలని జడ్పీ సీఈవో జ్యోతిబసు అన్నారు. వెంగళాయపాలెంలో గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛగాలి అనే అంశంపై గ్రామ సభ నిర్వహించారు. తొలుత గ్రామంలో సైకిల్ ర్యాలీ, ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమా లను జరిపారు. డీపీవో నాగసాయి కుమార్ పరిశ్రమలు, మోటార్ వాహ నాల నుంచి విడుదలయ్యే గాలి కలుషితంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతిలో జీవ సమతుల్యత, చెట్లు, నీటి చెరువుల ఆవశ్యకత గురించి సీఆర్‌డీఏ హార్టికల్చర్, ప్లాంటేషన్ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ వివరించారు. ఎంపీడీవో బండి శ్రీనివాస రావు, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, ప్రత్తిపాడు, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం డీఈఈ భాను ప్రకాష్, గ్రామ ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆలయాల వద్ద పారిశుధ్య పనుల పరిశీలన

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలపాడు రోడ్డు ప్రశాంతినగర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద కల్వర్టుని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం పరిశీలించారు. పాలపాడు రోడ్డులో ఎన్‌ఆర్‌టీ ప్రయిడ్ వద్ద జరుగుతున్న డంపింగ్, గడ్డి, పిచ్చిమొక్కల తొలగించడం, పనులను చూశారు. కార్తీకమాసంలో శివాలయం వద్ద స్నానాలకి, పూజా కార్యక్రమాలకి ఇబ్బంది కలగకుండా ఉండేలా ఎన్ఎస్‌పీ కాలువ శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్తం...

నరసరావుపేట రూరల్: స్థానిక సుబ్బరాయ, నారాయణ కళాశాలలో శనివారం 2025, 26 సంవత్సరాలకు సంబంధించిన నూతన ఎన్‌సీసీ కేడెట్ల సెలక్షన్లు నిర్వహించారు. కార్యక్రమంలో 23వ ఆంధ్ర బెటాలియన్ సూబేదార్ మేజర్ నజీర్ అహ్మద్, హవల్దార్ షాంశెన్ సింగ్, కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ రాజు, ప్రిన్సిపాల్ సుధీర్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● ఈపూరు: గ్రామాలలో ప్రతి ఒక్కరు ఇంటిపైన సోలార్ విద్యుత్ పెట్టుకుని విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలని ఈపూరు ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. ఈపూరులో ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్‌నిర్మాణంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ గాంధీబాబు, ఏపీమోడల్‌స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

● ఈపురులోని ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో ఉమాదేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆధార్ సెంటర్ ఆపరేటర్ మారుతీ కృష్ణకిషోర్‌కు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యాశాఖ అధికారిని సంప్రదించి మండలంలోని పాఠశాలల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

● రొంపిచర్ల: రొంపిచర్ల గ్రామానికి చెందిన గెల్లి బ్రహ్మారెడ్డి జిల్లా వైసీపీ విభాగం ఆర్గనైజేషన్ సెక్రటరీగా శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్ఠానం నుంచి నియామక ఉత్తర్వులను అందుకున్నారు.

● వినుకొండటౌన్: నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలో గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన కాకర్ల హరిశ్చంద్రప్రసాద్ చేతిలో దారుణానికి గురైన కాపు సామాజికవర్గానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి న్యాయం చేయాలంటూ వినుకొండ నియోజకవర్గంలోని కాపు నాయకులు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనవ్యక్తం చేసి తహసీల్దర్‌కు వినతిని అందజేశారు.

● బొల్లాపల్లి: బదిలీపై వెళుతున్న వినుకొండ పట్టణ ఎస్ఐ సమీర్‌బాషాను శనివారం బొల్లాపల్లి మండలం జనసేన ప్రధాన కార్యదర్శి కొల్లి నాసర్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు హనుమానాయక్, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు సత్కరించారు.

● శావల్యాపురం: సూర్యఘర్ పథకంతో పేదప్రజలకు విద్యుత్ బిల్లుల నుండి విముక్తి కలుగనుందని ఎంపీడీవో పి.సీతారామయ్య అన్నారు. సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ సిబ్బంది స్థానిక సబ్‌స్టేషన్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంచారు.

● మతుకుమల్లి(శావల్యాపురం): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ఎండీఎం ఆపరేటర్‌లు నాణ్యతాప్రమాణాలను పాటించాలని ఎంఈవో ఎం.సాంబశివరావు తెలిపారు. మండలంలోని మతుకుమల్లిలో మోడల్ ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు.

● శావల్యాపురం: వైద్యాధికారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శావల్యాపురం పీహెచ్‌సీ వద్ద వైద్యసిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇన్‌చార్జి వైద్యాధికారి అజిత, సిబ్బంది పాల్గొన్నారు.

● ఈపూరు: ప్రభుత్వవైద్యుల సమ్మెకు మండలంలోని కొచ్చర్ల పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్యసిబ్బంది మద్దతు తెలిపారు. ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు.


ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

● కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు

నరసరావుపేట రూరల్, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటుగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వ ర్లు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలకు అనుగుణం గా బాటలు వేయడమే తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో పాడుతా తీయగా బృందం, కె.నాసరయ్య, కె. వీరరాఘవులు, ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న వక్తలు

సృజనాత్మక ఆలోచనలతో ప్రేరణ

నరసరావుపేట రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలోని టెక్ హబ్‌లో నిర్వహించిన 'ఇగ్నైట్ ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్షిప్ స్టార్టప్స్' రెండోరోజు కార్యక్రమంలో, విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలను వాస్తవరూపంలోకి తేవడానికి ప్రేరణపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా తరుణ్ కృష్ణమూర్తి, మేనేజింగ్ పార్టనర్, క్రాష్‌ప్లాన్ అన్నాన్ టెక్నాలజీస్, డిజైన్ థింకింగ్, ప్రొడక్ట్ మార్కెట్ ఫిట్ వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆంజనేయులుకు గోనుగుంట్ల సంతాపం

రొంపిచర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంతగుడిపాడు గ్రామానికి చెందిన టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మంజుల ఆంజనేయులు ఇటీవల మృతి చెందారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు శనివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ఆంజనేయులు సేవలను కొనియాడారు. మందలపు వెంకటరత్నం, పేరుపోగు దాసు, రుసూల్, మోదుగుల కొండలు తదితరులు సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.


ఆంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

జీఎస్టీ 2.0తో సామాన్యుడికి భారీ ఉపశమనం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో సామాన్యుడికి భారీ ఉపశమనం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం నరసరావుపేటలోని టౌన్‌హాల్ వద్ద ద్విచక్రవాహనాల స్టాల్స్ ఏర్పాటుచేశారు. పోలీస్‌శాఖ, ట్రాఫిక్ పోలీస్ విభాగం సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహనాల యజమానులతో నిర్వహిస్తున్న ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భారీగా తగ్గిన విద్యుత్ గృహోపకరణాల ధరలు

నరసరావుపేట రూరల్: జీఎస్టీ 2.0తో విద్యుత్ గృహోపకరణాల ధరలు భారీగా తగ్గాయని ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ తెలిపారు. సూపర్ జీఎస్టీ.. సూపర్‌సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీని శనివారం ఆయన విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పట్టణ వీధులలో శివుడు బొమ్మ సెంటర్ మీదుగా ప్రధాన రహదారి మీదుగా కోట సెంటర్ నుండి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు సాగింది. సిబ్బందితో ప్లకార్డ్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్తు పెట్టుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. ర్యాలీలో ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్ రాంబోట్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డీఈఈ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్లు రఫీ సురేంద్రబాబు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు

● రొంపిచర్ల: రొంపిచర్లలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ నిర్వహించారు. ఏడీఈ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సూర్యఘర్ పథకం గురించి వివరించారు. కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలూరిపేటను హరితమయం చేద్దాం


చిలకలూరిపేట: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి తదితరులు

చిలకలూరిపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని హరితమయం చేద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలో మున్సిపల్, పంచాయతీ విభాగాలు నిర్వహించిన స్వచ్ఛ చిలకలూరిపేట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక పండరీపురంలోని బి.ఆర్.ఐ.జీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులతో కలిసి మొక్కలునాటారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు, అర్బన్ సీఐ రమేష్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: ప్రతి మూడో శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్‌లలో పోలీసు అధికారులు, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో, పరేడ్‌గ్రౌండ్‌లో శుభ్రం చేశారు.

● వినుకొండటౌన్: మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో "స్వచ్ఛఆంధ్ర స్వర్ణఆంధ్ర స్వచ్ఛదివస్" కార్యక్రమాన్ని గీతమ్స్‌స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా దస్తగిరి మాట్లాడుతూ గాలి కాలుష్యం తగ్గించడానికి విరివిగా మొక్క లు నాటాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్, స్కూల్ డైరక్టర్ కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలంతా మొక్కలు పెంచాలని ఎంపీడీవో పి.సీతారామయ్య అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శావల్యాపురం జడ్పీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో యాకోబు, హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.


వినుకొండ: మొక్కలు నాటుతున్న అధికారులు, పాఠశాల యాజమాన్యం

● బొల్లాపల్లి: ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కాలుష్యంపై ఎంపీడీవో పీ మాధురి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వ రాయితీ చెక్కులు పంపిణీ

చిలకలూరిపేట, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పనితీరు, మంచి నైపుణ్యంతో నేత కార్మికులు చిలకలూరిపేట చేనేతకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకురావాలని, ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలతో నేతన్నలు ఆర్థికంగా వృద్ధి చెందాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని చేనేత కార్మికులు ఒక్కొక్కరికి రూ.60వేల చొప్పున 37మందికి ప్రభుత్వ రాయితీ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, టీడీపీ, జనసేన నాయకులు నెల్లూరి సదాశివరావు, తోట రాజారమేష్, ఏడీ సాయి ప్రసాద్, డీవో ఉమ మహేశ్వరరావు పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


నరసరావుపేట: కార్యక్రమంలో పాల్గొన్న టిడ్కో కాలనీ ప్రజలు, కమిటీ సభ్యులు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టిడ్కో సీఎల్‌టీసీ విజయకాంత్ తెలిపారు. పట్టణ శివారు ప్రాంతంలోని టిడ్కోకాలనీ వద్ద శనివారం వాతావరణ కాలుష్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకాంత్ మాట్లాడుతూ ఇండ్లలో రోజువారి వ్యర్థాలను తగలబెట్టకుండా చెత్తసేకరించే వారికి అందజేయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో టిడ్కో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సెల్వరాజ్, మేడికొండ సత్యానందబాబు, మల్లేశ్వరి, షేక్ సుజానా పాల్గొన్నారు.

● రొంపిచర్ల: రొంపిచర్లలో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గాలి కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్ర దినోత్సవం సందర్భంగా క్లీన్ ఎయిర్ కార్యక్రమాన్ని ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వచ్ఛమైన గాలికోసం మొక్కలు నాటాలని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న అధికారులు, అంగన్‌వాడీలు

పోషక మహాన్ మంత్

వినుకొండటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వినుకొండలోని గుర్రం జాషువా కళావేదికలో "పోషక మహాన్ మంత్ 2025" ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వినుకొండ మునిసిపల్ చైర్మన్ షేక్ షకీలా దస్తగిరి మాట్లాడుతూ ప్రస్తుతం మహిళల్లో, ఇప్పుడే పుట్టిన పిల్లల్లో, కౌమారదశ పిల్లల్లో పౌష్టిక ఆహారలోపం వల్ల కలిగే ఇబ్బందులు, పరిష్కారమార్గాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుట్టారెడ్డి, శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య, ప్రజెంట్ కోఆర్డినేటర్ రత్నకుమార్, బొల్లాపల్లి రియా కోఆర్డినేటర్ ఆల శ్రీనివాసరావు, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు : ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ జయరామిరెడ్డి

నూజెండ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ ఎం.మురళీకృష్ణయాదవ్ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు రూ.కోట్ల నిధులు వెచ్చినా రక్షిత మంచినీరు అందించలేకపోవటం ఏంటనిప్రశ్నించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, నూజెండ్ల సొసైటీ చైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి, ఎంపీడీవో పీ ఉమాదేవి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

22న సొలసలో డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు

యడ్లపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయివాలీబాల్ పోటీలు ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నాగరత్నం తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాలలో నిర్వహించే ఈ పోటీలు మండలంలోని సొలస జడ్పీ హైస్కూల్‌లో జరుగుతాయన్నారు. డివిజన్‌స్థాయి జట్ల ఎంపిక కూడా ఉంటుందన్నారు.

3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

చిలకలూరిపేట: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ నవంబర్ 3నుంచి సమ్మె చేస్తామని ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చిలకలూరిపేట శాఖ నాయకులు శనివారం ప్రకటించారు. సీపీఐ, ప్రజాసంఘాల నాయకులతో కలసి వారు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబుకు సమ్మె నోటీసును అందచేశారు. కార్యక్రమంలో సీపీఐ, ఆయా సంఘాల నాయకులు తాళ్లూరి బాబురావు, చెంచయ్య, అంజయ్య, వరహాలు, నిర్మల పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన

ఈపూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడిపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈపూరులో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిందితుడిపై కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బంజల కన్నయ్య, స్వర్ణ మునలయ్య, రాంబాబు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరశిస్తూ అరుంధతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతమ్స్ హైస్కూల్లో ముందస్తు దీపావళి

వినుకొండ: నరసరావుపేటరోడ్డు గీతమ్స్ హైస్కూల్లో దీపావళి ముందస్తువేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి విద్యార్థులకు దీపావళిపండుగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31న చిలకలూరిపేట ఏపీఎన్‌జీవో ఎన్నికలు

నాదెండ్ల: ఈనెల 31వ తేదీన చిలకలూరిపేట ఏపీఎన్‌జీవో ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి కే నాగేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారి ఎం ఆనంద్‌నాథ్, పర్యవేక్షకులు ఏవీ కోటేశ్వరరావులు తెలిపారు. ఈ క్రమంలో 24వ తేదీన ఓటర్ల జాబితా ప్రచురణ, 28న తుదిజాబితా ఎంపిక, 31న చిలకలూరిపేట పట్టణంలోని పెన్షనర్ల సంఘ భవనంలో ఎన్నికలు జరుగుతాయని వివరించారు.


మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక డ్రైవ్

చిలకలూరిపేట: మండలంలోని పోతవరం కేజీబీవీలో శనివారం విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీ.సి.డి.ఓ రేవతి, మానసిక ఆరోగ్య నిపుణుడు ఫణీంద్రకుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకొని సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్పిపున్ పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో విజయవాడ పర్పుల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్క్‌షాప్ శనివారం నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిథిగా పర్పుల్ టెక్నాలజీస్ వెబ్ డెవలప్ ఇంజనీర్ ఏ రేవంత్ మాట్లాడుతూ అమెజాన్ వెబ్ సర్వీసెస్ అనేది ఇంటర్నెట్ ద్వారా కంప్యూట్ పవర్, స్టోరేజ్, డేటాబేస్‌ల వంటి ఆన్ డిమాండ్ ఐటీ వనరులను యాక్సెస్ చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, బోళ్ళ రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ కబడ్డీ జట్టుకు వాగ్దేవి విద్యార్థి ఎంపిక


ఆదిలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ కబడ్డీ జట్టుకు వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థి కే ఆదిలక్ష్మి ఎంపికైందని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. గుంటూరు చలపతి ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన ఏఎన్‌యూ అంతర కళాశాలల కబడ్డీ పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. ఈ నెల 27నుంచి మంగళూరు యూనివర్సిటీలో జరిగే సౌత్‌ఇండియా ఇం టర్ వర్సిటీ పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ఆదిలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపిక

నరసరావుపేట రూరల్: వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ నెల 16న గుంటూరులో జరిగిన అండ ర్ 19 ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో వాలీబా ల్ పోటీలో స్టేట్‌మీట్‌కి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఓగురి కోటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు దోసపాటి అనిల్, కొలకలూరి అనూహ్య ఈ నెల 31, నవంబర్ 1, 2 తేదీల్లో పలమనేరులో జరిగే పోటీలో పాల్గొననున్నారు. క్రీడాకారులను డిగ్రీ కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, సూదా సురేష్‌బాబు, ఇస్కేపల్లి కిషోర్, పీడీ డాక్టర్ రాజా మెర్సిన్, రాయల శ్రీనివాసరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, అచ్యుతరావు, రాయల ఆంజనేయులు అభినందించారు.

జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన


మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వినుకొండ తిమ్మాయపాలెం రోడ్డులోని వైకన్వెన్షన్ హాల్లో శనివారం జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలు, ఎరువులు, ఇతర వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. జీఎస్టీ విధానం ద్వారా పన్నుల సరళీకరణతో పాటు రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం గణనీయమైన ఊరట కల్పించిందన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ 6 పథకం ఈ రెండూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయన్నారు.కార్యక్రమంలో రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను నేర్పాలి

● నూతన ఉపాధ్యాయుల సన్మానంలో ఎమ్మెల్యే చదలవాడ


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, ఆర్డీవో, డీఈవో, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను నేర్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నరసరావుపేట కలెక్టరేట్‌లో మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల సన్మానం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చేపట్టబోతున్న అందరికి అభినందనలన్నారు. జిల్లానుంచి ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సన్మానంచేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ శేషగిరిరావు, ఆర్డీవో మధులత, డీఈవో చంద్రకళ, డీఆర్వో మురళీ, రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ శ్రీనివాసగుప్త, రాంప్రసాదరెడ్డి, మురళి, విన్సెంట్‌పాల్, డాక్టర్ సృజనా, భుజంగరావు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

వినుకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వినుకొండ 1వవార్డ్ జడ్పీ బాలికల హైస్కూల్లో న్యాయవిజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. "ప్రొవిజన్స్ ఆఫ్ ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2002" అనే అంశం మీద న్యాయవిజ్ఞాన సదస్సును న్యాయమూర్తి ఎం మహతి వివరించారు. జాతీయ పతాకాన్ని గౌరవించడం తదితర విషయాలను న్యాయమూర్తి వివరించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పఠాన్‌గౌస్ మొహిద్దిన్‌ఖాన్, ట్రెజరర్ వరగాని శివశంకరబాబు, ఆళ్ల మహేశ్వర్‌రెడ్డి, ఐనాల నాగపద్మ, ఆళ్ల మహేశ్వర్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ శైలజకుమారి, కళాశాల సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

విలువలతో కూడిన విద్యతోనే మంచి ఫలితాలు


నడికట్టు రామిరెడ్డి
మాట్లాడుతున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నిబద్ధత, విలువలతో కూడిన విద్యతోనే నడికట్టు రామిరెడ్డి హైస్కూలు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలిగారని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. చిరుమామిళ్ళలో జరిగిన ఏపీడబ్ల్యూజేయూ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సమాజాభివృద్ధికి విద్య చాలా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న లక్ష్యంతోనే పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. హెచ్ఎం కిషోర్, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.